సంపుటి :02 సంచిక :150 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

సోమవారం 04, ఆగస్టు 2025

కేసీఆర్ కాళేశ్వరం కోసం

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఫణంగా పెట్టారు !

- మేడిగడ్డ నిర్మాణం వెనుక అవకతవకలు వాస్తవం
- బీఆర్ ఎస్ హయాంలోనే ఆ బరాజ్ కూలింది..
- డిజైన్, నిర్మాణంలో లోపాలు జరిగాయి..
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

04





## అక్రమ ఇటుక బట్టీల బంగ్లా

### శివార్లలో అనధికారికంగా బట్టీలు

- అనుమతులు లేకుండా దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పంట దిగుబడులపై దుమ్మూ, ధూళి ప్రభావం
- సారం కోల్పోతున్న సాగు భూములు

మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండల కేంద్రం (బంగ్లా) అక్రమ ఇటుక బట్టీలకు అడ్డాగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు వ్యాపారులు యథేచ్ఛగా ఇటుక దందా సాగిస్తు న్నారు. సాగు భూములను బీడుగా మార్చి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ కోట్లు గడిస్తున్న ఈ మాఫియా ఆగడాలకు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది.

- అక్షరదర్బార్, మరిపెడ

02



ఎర్రవల్లి ఫాం హౌస్ కు

## గులాబీ శ్రేణులు

కాళేశ్వరం, కవిత అంశాలపై కేసీఆర్ చర్చ

02

## హస్తినకు ‘హస్తం’ శ్రేణులు

- చర్లపల్లి నుంచి బయల్దేరిన ప్రత్యేక రైలు
- జెండా ఊపి ప్రారంభించిన మీనాక్షి, మహేశ్ కుమార్ గౌడ్

02

బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో ఆమోదింప జేయాలని, అందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగానే పార్టీ చేపట్టిన ‘చలో ఢిల్లీ’ కోలాహలం మొదలైంది. సోమవారం చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో పార్టీ శ్రేణులు ఢిల్లీకి బయల్దేరి వెళ్లాయి. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి ఈ ప్రత్యేక రైలును ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది కాంగ్రెస్ శ్రేణులు, నేతలు ఉన్నారు.

–అక్షరదర్బార్, హైదరాబాద్



## 14 నెలల పాప అదృశ్యం

గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు అనుమానం

04



కస్తూర్బా గురుకుల పాఠశాలలో

## ఫుడ్ పాయిజనింగ్

27 మంది విద్యార్థులకు అస్వస్థత

03



# హస్తినకు ‘హస్తం’ శ్రేణులు

## చర్లపల్లి నుంచి బయల్దేరిన ప్రత్యేక రైలు

### జెండా ఊపి ప్రారంభించిన మీనాక్షి, మహేశ్‌కుమార్ గౌడ్



అక్షరదర్బార్, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఆమోదింప జేయాలని, అందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగానే పార్టీ చేపట్టిన ‘చలో ఢిల్లీ’ కోలాహలం మొదలైంది. సోమవారం చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో పార్టీ శ్రేణులు ఢిల్లీకి బయల్దేరి వెళ్లాయి. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి ఈ ప్రత్యేక రైలును ప్రారంభించారు. తరలివెళ్లిన వారిలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది కాంగ్రెస్ శ్రేణులు, నేతలు ఉన్నారు. పార్టీ నేతలు 6న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టనున్నారు. పార్లమెంటులో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించేందుకు కాంగ్రెస్ ఎంపీలు సన్నద్ధమవుతున్నారు. మంగళవారం పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు బీసీ రిజర్వేషన్ల పెంపుపై చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇవ్వనున్నారు. 7న ఆ పార్టీ నేతలు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నారు.

# ఎర్రవల్లి ఫాం హౌస్ కు గులాబీ శ్రేణులు

## కాళేశ్వరం, కవిత అంశాలపై కేసీఆర్ చర్చ



అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. కేసీఆర్ ఈ భేటీలో తన తనయ, ఎమ్మెల్సీ కవిత వ్యవహార శైలితో పాటు కాళేశ్వరం కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికపై చర్చించిన్నట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్ట్ నివేదికపై కేబినెట్ సమావేశం నిర్వహించిన నేపథ్యంలో కేసీఆర్ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. గత బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం నిర్మాణంపై ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టుపై కేబినెట్‌లో చర్చించారు. మరోవైపు.. కాళేశ్వరంలో ఎక్కడా అవినీతి జరగలేదని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. డిజైన్‌లో లోపాలు లేవని అంటున్నారు. వ్యాప్కో సంస్థ సూచనల మేరకు ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్టు ఇప్పటికే అనేకసార్లు వారు మీడియా ముఖంగా వెల్లడించారు.



# నిస్వార్థ సేవలతోనే సమాజంలో గుర్తింపు

## దుగ్గొండి రూరల్ సీఐ సాయి రమణ

అక్షర దర్బార్,దుగ్గొండి : ప్రభుత్వ ఉద్యోగంలో ప్రజలకు నిస్వార్థంతో సేవలందిస్తేనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని దుగ్గొండి రూరల్ సీఐ సాయి రమణ అన్నారు. సోమవారం దుగ్గొండి పోలీస్ స్టేషన్ లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బంది కి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి వారిని సన్మానించారు ఈ కార్యక్రమానికి సిఐ సాయి రమణ ముఖ్యఅతిథిగా హాజరై బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బంది శేఖర్, రాకేష్, షబ్బీర్ , రమేష్ లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ప్రతి ఉద్యోగి బదిలీ తప్పదని ఎక్కడ పనిచేసిన నియమ నిబద్ధత పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్సై రావుల రణధీర్ రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




# 51వ సార్లు రక్తదానం చేసిన అమ్మ అశోక్

## అత్యవసర పరిస్థితిలో అండగా ఉంటున్న అశోక్.

## అభినందించిన వైద్య సిబ్బంది.




అక్షర దర్బార్, పరకాల : పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు అమ్మ అశోక్ సోమవారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటలో రక్తం అవసరం ఉందని ఫోన్ రావడంతో వెంటనే స్పందించి రక్తదానం చేశాడు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 51వ సార్లు రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచాడు. అశోక్ ను పరకాల హాస్పిటల్ ఆర్ ఎం ఓ బాలకృష్ణ, రమేష్, కృష్ణ , ప్రశాంత్ ప్రమీల రమేష్ అభినందించారు.

# ‘భక్తి మందారాలు’ పద్య సంపుటి పుస్తక విష్కరణ




అక్షర దర్బార్, పరకాల : కాకతీయ పద్య కవితా వేదిక ఆధ్వర్యంలో కవిచంద్ర నర్సింగోజు లక్ష్మయ్య రచించిన భక్తి మందారాలు పుస్తక ఆవిష్కరణ స్థానిక లష్కర్ బజార్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి అధ్యక్షులుగా డాక్టర్ యన్ వి చారి ముఖ్య అతిథిగా పుస్తక ఆవిష్కర్తగా డాక్టర్ సాంబమూర్తి విశిష్ట అతిథిగా యల్లంభట్ల నాగయ్య పాల్గొన్నారు. పోతన పేర్కొన్న నవవిధ భక్తి తత్త్వము లలో స్తుతి ప్రధానమైనదని ఆ స్తుతిని భక్తి మందారా లు పుస్తకం లో పద్యరూపంలో దేవుని శరణాగతి కోరుతూ ఆర్తిగా వెలువరించారని సమీక్షకులు అష్టావధాని చేపూరి శ్రీరాం తెలియజేశారు. నేటి కాలంలో పద్యం యొక్క ప్రాధాన్యతను అధ్యక్షులు డాక్టర్ యన్ వి యన్ చారి తెలియజేయగా పద్యం యొక్క ప్రాభవం కాపాడాలని డాక్టర్ సాంబమూర్తి కోరారు. కాకతీయ పద్య కవితా వేదిక నిర్వాహకులు అక్కెర కరుణా సాగర్, కొండా యాదగిరి, వెలుగు ప్రభాకర్ మంచికట్ల శ్రీనివాస్ , తంగెళ్లపల్లి ఆనందా చారి, సిద్దెంకి బాబు హాజరు కాగా రచయిత నర్సింగోజు లక్ష్మయ్య వందన సమర్పణ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

# అక్రమ ఇటుక బట్టీల ‘బంగ్లా’

**మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండల కేంద్రం (బంగ్లా) అక్రమ ఇటుక బట్టీలకు అడ్డాగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు వ్యాపారులు యథేచ్ఛగా ఇటుక దందా సాగిస్తున్నారు. సాగు భూములను బీడుగా మార్చి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ కోట్లు గడిస్తున్న ఈ మాఫియా ఆగడాలకు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది.**

**- అక్షరదర్బార్, మరిపెడ**

- శివార్లలో అనధికారికంగా బట్టీలు
- అనుమతులు లేకుండా దందా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పంట దిగుబడులపై దుమ్మూ, ధూళి ప్రభావం
- సారం కోల్పోతున్న సాగు భూములు



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రం (బంగ్లా)లో అక్రమ ఇటుక బట్టీల వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నది. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు దందా సాగిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి సాగు భూములను నాశనం చేస్తున్నారు. అడ్డగోలుగా లాభాలు గడిస్తూ కోట్లు కూడబెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, చూసీచూడనట్లు వ్యవహరించడంతో అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. అక్రమార్కులు రైతుల అమాయకత్వాన్ని, ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని విలువైన సాగు భూములను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ఇటుక తయారీకి అవసరమైన మట్టిని తవ్వడం వల్ల వ్యవసాయ భూములు బీడుబారుతున్నాయి. గతంలో ట్రిప్పు ఇటుక రూ.10,000-11,000 పలికితే, ఇప్పుడు రూ.14,000-16,000 వరకు అమ్ముతూ సామాన్య ప్రజలను దోచుకుంటున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇటుకలకు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి

మండల కేంద్రంలోని కాకతీయ కళాతోరణం, మహాత్మా జ్యోతి బా పూలే విద్యాలయం, మరిపెడ బైపాస్, దేశియా తండా సమీపంలోఈ అక్రమ ఇటుక బట్టీలు వెలిశాయి. యాజమానులు ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతోంది. మైనింగ్ శాఖ అనుమతులు తీసుకుంటే ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా, ఒక్కరు కూడా నిబంధనలు పాటించడం లేదు. కొందరు వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై, వ్యవసాయానికి ఉచితంగా సరఫరా చేసే విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. మోటార్లకు సరఫరా చేసే విద్యుత్‌ను ఇటుక బట్టీలకు మళ్లిస్తూ విద్యుత్ శాఖకు కూడా నష్టం కలిగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ విద్యుత్ వాడకానికి అడ్డు అదుపు లేకుండా పోతున్నది. ఇటుక బట్టీల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతున్నది. బట్టీల నుంచి వెలువడే కాలుష్యం, బూడిద, ధూళి, దుమ్ము సమీపంలోని పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. వంట చెరుకును కాల్చడం, చెరువులు, కాలువలకు సమీపంలో బట్టీలను ఏర్పాటు చేసి విలువైన వనరులను కొల్లగొట్టడం వంటి ఉల్లంఘనలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

### వెట్టిచాకిరీపై నిఘా లేదు..

ఈ బట్టీలలో వలస కూలీలతో నిబంధనలకు విరుద్ధంగా వెట్టిచాకిరీ చేయిస్తున్నప్పటికీ కార్మిక శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలనే ఉద్దేశంతో వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా వందలాది ఇటుక బట్టీలు కొనసాగుతున్నా, ఇప్పటివరకు ఒక్కదానికి అధికారిక అనుమతులు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ అక్రమ ఇటుక బట్టీల వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని, పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




అక్షరదర్బార్, వడ్డేపల్లి: హనుమకొండ వడ్డేపల్లి సాయి స్పందన హై స్కూల్, పాఠశాలలో సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సమాజ శ్రేయస్సుకు ఎక్కడైనా మత్తు పదార్థాల వాడకాన్ని గమనిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1908, మత్తు నుండి బయటకు రావాలి అనుకునే వారు 14446 కు సంప్రదించాలని కమ్యూనిటీ ఎడ్యుకేటర్ అలువాల తేజస్వీ చెప్పారు. ఏహెచ్ టీయూ ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, తెలియని నెంబర్లకు ఫోటోలు, వీడియోలు పంపకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు



కాటారం, అక్షర దర్బార్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని వైద్యారోగ్య శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యవేక్షణ అధికారి, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు.

**సుడిగాలి పర్యటనలో...**

డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి ప్రధాన ఆసుపత్రి, మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం, ఐసిటిసి కేంద్రం, మరియు కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొప్పారం సబ్ సెంటర్లను సందర్శించారు. మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ, ఐపీ కేసుల సంఖ్య ఎంత ఉందని, ఎలాంటి వ్యాధులతో ప్రజలు వైద్యం కోసం వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐసిటిసి కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, హెచ్ఐవి బాధితులకు అందుతున్న ఏఆర్‌టీ మందుల వివరాలను కౌన్సిలర్ గాదె రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డును తనిఖీ చేసి, రోగులకు అందుతున్న చికిత్సలను, కేస్ షీట్లను పరిశీలించి, రోగులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, ఇన్‌చార్జి సీడబ్ల్యూఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, మహాదేవపూర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ విద్యావతి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డ్యూటీ డాక్టర్ సుకన్య, ములుగు దిశ సీపీఎం జ్యోతి, సీఎస్ఓ సారయ్య, ఐసిటిసి కౌన్సిలర్ గాదె రమేష్, హెడ్ నర్సింగ్ ఆఫీసర్లు వినయ్ కుమారి, బాలమణి, ఎల్‌టి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ హామీ నిలబెట్టుకుంటాం

## గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు

అక్షరదర్బార్, హనుమకొండ: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఇచ్చిన ప్రతీహామీ నిలబెట్టుకుంటామని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు మేలు చేయడం, వారి కుటుంబాలకు అండగా నిలవటం తమ ప్రథమ కర్తవ్యమని చెప్పారు. ఆ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని అన్నారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న కళను నిజం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ప్రకటించారు. ఈ ఏడాది చివరినాటికి హామీలు అమలుపరచి, అన్ని పనులను పూర్తి చేసి సభ్యుల తీర్పు కోరుతామని ప్రకటించారు. సోమవారం డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఇన్సురెన్స్ ఫారాల స్వీకరణ కార్యక్రమంలో వారిని ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, సహాయకార్యదర్శులు పొడిచెట్టి విష్ణువర్ధన్, పెద్దపెల్లి వరప్రసాద్, బూర్ల నరెందర్, వలిశెట్టి సుధాకర్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, సాక్షి ఎడిషన్ ఇంచార్జ్ వర్దెల్లి లింగయ్య, నమస్తే తెలంగాణ ఎడిషన్ ఇంచార్జ్ రామగిరి కిరణ్, డెస్క్ జర్నలిస్టులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



# కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్



## 27 మంది విద్యార్థులకు అస్వస్థత

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరిక్షాల గ్రామంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ కలకలం రేపింది. సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన 27 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న వారిలో 14 మందిని చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన 13 మందికి పాఠశాలలోనే వైద్య సేవలు అందిస్తున్నట్లు సమాచారం.

**విలేకరులకు తాళాలు, తల్లిదండ్రుల ఆవేదన..**

సమాచారం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న స్థానిక విలేకరులను పాఠశాల ప్రధాన గేటుకు తాళాలు వేసి లోపలికి అనుమతించకపోవడం గమనార్హం. హాస్టల్ ఇన్‌చార్జి ఫోన్ చేసినా స్పందించలేదని తెలుస్తోంది. తమ పిల్లల పరిస్థితి తెలుసుకోవడానికి వచ్చిన తల్లిదండ్రులను కూడా లోపలికి అనుమతించకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారుల పర్యవేక్షణ..**

ఘటన గురించి తెలుసుకున్న వెంటనే భూపాలపల్లి అదనపు



కలెక్టర్ విజయలక్ష్మి, హాస్టల్‌కు సంబంధించిన ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీవో కస్తూర్బా గురుకుల పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

**గండ్ర దంపతుల ఆరోపణలు నిజమయ్యాయా?**

వారం రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి దంపతులు భూపాలపల్లి జిల్లాలోని పలు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం వంటలు అందిస్తున్నారని, భోజనం పౌష్టికాహారంగా లేదని ఆరోపణలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం మేర పెంచినా సిబ్బంది తీరు మారడం లేదని అప్పుడే పేరెంట్స్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో వరుసగా చోటుచేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ సంఘటనల నేపథ్యంలో ఈ ఘటన మరింత ఆందోళన కలిగిస్తోంది.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ



అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి : ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును పరిష్కరించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి సమస్యలపై 90 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులకు ఈ దరఖాస్తులను ఎండార్స్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసం పొందే విధంగా పనిచేయాలి

## భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: విధి నిర్వహణలో ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా నలుమూలల నుండి 21 మంది ప్రజలు, ఎస్పీ తో నేరుగా తమ సమస్యలను తెలిపారు. సమస్యలను విన్న వెంటనే ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాల వచ్చి, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడు, పోలీసుల పట్ల గౌరవం నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. బాధితుల సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులను ఆదేశించారు.

# ఇంటింటికీ బీజేపీ పథకాలు

## ప్రజలకు అవగాహన కల్పించాలి

## పులసాని తిరుపతిరావు



అక్షర దర్బార్, చిట్యాల : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పులసాని తిరుపతిరావు పిలుపునిచ్చారు. చిట్యాలలో సోమవారం నిర్వహించిన మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోడీ పేదల కోసం ముద్ర లోన్లు, ఎల్ఈడీ బల్బులు, వందే భారత్ రైళ్లు, ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు, యూనివర్సిటీలు, యూరియా ఫ్యాక్టరీల వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణకు వందల కోట్ల నిధులు విడుదలయ్యాయని, బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటికి గుణపాఠం చెప్పాలని పులసాని తిరుపతిరావు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, జిల్లా, మండల నాయకులు చెక్క నరసయ్య, సుద్దాల వెంకటరాజ వీరు, సుదగాని శ్రీనివాస్, నల్ల శ్రీనివాస్ రెడ్డి, మైదం శ్రీకాంత్, గోపగాని స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించాలి

## కలెక్టర్ రాహుల్ శర్మ

## ఎరువుల గోదాం తనిఖీ



అక్షర దర్బార్, రేగొండ : రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి చెందిన ఎరువుల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, ఎరువుల నిల్వలు, కొనుగోలు రసీదుల పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల సరఫరా, పంపిణీపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం లేదా ఆధార్ కార్డుతో సంప్రదించి ఎరువులను తీసుకోవచ్చని సూచించారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించాలని, దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను ప్రతిరోజు అప్డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమాలను సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలో మండల తాసిల్దార్ శ్వేత రావు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్,చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సోమవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సందర్శించి భోజన వసతులపై ఆరాతీశారు విద్యార్థులకు కలుగుతున్న సమస్యలపై దృష్టి సారించి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని వార్డెన్ కు సూచించారు అనంతరం విద్యార్థుల కోసం వండిన వంటకాలను పరిశీలించారు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో ఉన్నతంగా ఎదిగేందుకు చదువుకోవాలని విద్యార్థులను కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముగిరాల మధువంశీకృష్ణ దొడ్డి కిష్టయ్య చిలుకల రాయ కొంగురు శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి ఫుడ్ పాయిజన్ ఘటనలో

# బీఆర్ఎస్-కాంగ్రెస్ వాగ్వాదం

### పోలీసులు రంగ ప్రవేశం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన రాజకీయ వివాదానికి దారితీసింది. సోమవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తిన్న 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో 14 మందిని చిట్యాల ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య ప్రశ్నించగా, కాంగ్రెస్ శ్రేణులు వాగ్వాదానికి దిగి, ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. మిగిలిన 13 మంది విద్యార్థులను కూడా ఆసుపత్రికి తరలించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. బ్రేక్‌ఫాస్ట్‌లో పురుగు రావడంతో అస్వస్థతకు గురయ్యారని, అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఈ సంఘటనను కొందరు రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోరుక సదయ్యను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది.



# పట్టుబడిన అంబులెన్స్ డ్రైవర్

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కంగుతిన్న పోలీసులు



అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు అశోక జంక్షన్ పరిసరాల్లో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సింగరేణి కాలరీస్ కు సంబంధించిన అంబులెన్స్ డ్రైవర్ ని ట్రాఫిక్ పోలీసులు పరీక్ష చేయగా, సదరు అంబులెన్స్ డ్రైవర్ సైతం మద్యం సేవించి వాహనం నడపటంతో ఒక్కసారిగా ట్రాఫిక్ పోలీసులు కంగుతిన్నారు. ప్రమాదంలో ఉన్న వారిని చికిత్స కోసం హాస్పటల్ తరలించాల్సిన అంబులెన్సు డ్రైవర్ సూరపాక ప్రశాంత్ మద్యం సేవించి వేగంగా అంబులెన్సు నడపటం ద్వారా ఎన్ని రోడ్డు ప్రమాదాలు జరిగేవోనని, అంబులెన్స్ డ్రైవర్ పై కేసు నమోదు చేశామని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు.

# కేసీఆర్ కాళేశ్వరం కోసం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఫణంగా పెట్టారు !



- మేడిగడ్డ నిర్మాణం వెనుక అవకతవకలు వాస్తవం
- బీఆర్ ఎస్ హయాంలోనే ఆ బరాజ్ కూలింది..
- డిజైన్, నిర్మాణంలో లోపాలు జరిగాయి..
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టిందని, నిర్మాణం కోసం అధిక వడ్డీలతో రూ.84 వేల కోట్ల అప్పు చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో క్యాబినెట్ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం వెనుక అవకతవకలు జరిగాయన్నారు. రూ.38 వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చారని మంత్రి తెలిపారు. భారీగా అప్పులు తీసుకుని చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, బీఆర్ఎస్ హయాంలోనే కూలిపోయిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంపై జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ చేపట్టామని, 660 పేజీల నివేదికను కమిషన్ సమర్పించిందని వెల్డించారు. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ 25 పేజీలతో సంక్షిప్తం చేసిందని వివరించారు. 2016లో మేడిగడ్డ ప్రాజెక్టు ఒప్పందం జరిగి, 2019లో శంకుస్థాపన చేస్తే, 2023లోనే బ్యారేజీ కుంగిపోయిందని గుర్తుచేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ ఏ) నివేదిక ప్రకారం, మేడిగడ్డ నిర్మాణంలో ప్లానింగ్, డిజైన్‌లో లోపాలున్నాయని తేలిందని తెలిపారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లోనూ ఇదే సమస్య ఉందని కమిటీ వెల్లడించిందన్నారు. ఈ మూడు బ్యారేజీల్లో నీటి నిల్వకు అవకాశం లేదని కూడా కమిటీ స్పష్టం చేసిందని అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవన్న కేసీఆర్ నిర్ణయం నిజాయతీతో కూడింది కాదని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ పేర్కొందని మంత్రి వెల్లడించారు. అక్కడ తగినంత నీరు ఉందని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పినప్పటికీ, కేంద్రం నిర్ణయాన్ని కాదని.. నీటి లభ్యత లేదని గత ప్రభుత్వం లేఖ రాసిందని, ఆ లేఖ వెనుక దురుద్దేశాలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. నాటి సీఎం కేసీఆర్ నియమించిన నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దని, ప్రాణహిత మీద బ్యారేజీ కట్టవచ్చని సూచించినా, ఆ నివేదికను కేసీఆర్ పక్కనపెట్టారని దుయ్యబట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలని నిర్ణయించారని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుపై అప్పటి క్యాబినెట్ భేటీలో చర్చించలేదని, సీఎం నోటిమాట మేరకు కాంట్రాక్టులు ఇచ్చారన్నారు. ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు కట్టబెట్టేందుకు విలువలను రివైజ్ చేశారని ఆరోపించారు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోలు 230, 231, నిర్మాణ అనుమతులు చట్ట వ్యతిరేకమన్నారు. కాళేశ్వరం రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ అన్నింటికీ కేసీఆర్ వ్యక్తిగతంగా బాధ్యుడని కమిటీ పేర్కొందని మంత్రి స్పష్టం చేశారు.

# ముగిసిన మంత్రివర్గ సమావేశం

## – కాళేశ్వరం కమిషన్ నివేదికపై సుదీర్ఘమైన చర్చ

అక్షరదర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. ఈ భేటీలో మంత్రివర్గం కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై విస్తృతంగా చర్చించింది. ప్రాజెక్టుకు సంబంధించి కమిషన్ ఇచ్చిన నివేదికపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ, 650 పేజీల కాళేశ్వరం నివేదికను 60 పేజీల సారాంశంగా రూపొందించింది. క్యాబినెట్‌కు సమర్పించిన ఈ సంక్షిప్త నివేదికలో 32 సార్లు కేసీఆర్, 19 సార్లు హరీశ్‌రావు, 5 సార్లు ఈటల రాజేందర్ పేర్లు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మల్లేశం గౌడ్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రామ కోశాధికారి గోపరాజు లింగస్వామి నానమ్మ బుచ్చమ్మ మృతి చెందగా సోమవారం తెలుసుకొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇంచార్జి (కాంటెస్టెడ్ ఎమ్మెల్యే) అముదాలపెల్లి మల్లేశం గౌడ్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోడెల సతీష్, ఏదునూరి లింగన్న, రాపర్తి శ్రీధర్ గ్రామస్థులు పాల్గొన్నారు.



# ముంపును ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలి

## - రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్



అక్షరదర్బార్, వరంగల్: వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు సమాయత్తం కావాలని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో అరవింద్ కుమార్ వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరిష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయిలతో కలిసి గ్రేటర్ వరంగల్ నగరంలో వర్షాకాలంలో వరదల ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికల్లో భాగంగా, వరద ముంపు ప్రాంతాలను గుర్తించడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ గతంలో వరద ముంపు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని, సకాలంలో స్పందించకపోతే చిన్న సమస్య కూడా పెద్ద విపత్తుగా మారే అవకాశం ఉంటుందని అరవింద్ కుమార్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలో బల్దియా ఆధ్వర్యంలో నిర్వహించబడే డీఆర్ఎఫ్, జిల్లా అగ్నిమాపక శాఖ, ఎస్ డీఆర్ ఎఫ్ బృందాలు భారీ వర్షాల వల్ల నష్టం జరగకుండా ముంపు నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయిలో 6 ఎన్ డీఆర్ ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర పరిస్థితుల్లో ఈ బృందాలను వినియోగించుకోవాలని అన్నారు.

ఎన్ డీఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ ముందస్తుగా వరద నివారణ ప్రణాళికలను చేసుకొని ఉంటే సునాయసంగా వరద నుండి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవచ్చునని అన్నారు. నగరం వరద ముంపు నివారణకు తీసుకొంటున్న ముందస్తు చర్యల విషయంపై హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరిష్, డాక్టర్ సత్య శారద, కమిషనర్ చాహాత్ బాజ్ పాయి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ కు వివరించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి నయీమ్ నగర్ నాలా,, రాజాజీనగర్ కల్వర్టు, ప్రెసిడెంట్ పాఠశాల నుంచి నయీమ్ నగర్ వరకు నిర్మించిన రిటైనింగ్ వాల్, జవహర్ నగర్, సమ్మయ్యనగర్, భద్రకాళి చెరువు ఎఫ్ టీఎల్ లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఉప కమిషనర్లు రవిందర్, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్, డీఆర్ ఎఫ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ ఆరోగ్యశ్రీతో పునర్జన్మ

అక్షర దర్బార్, చిట్యాల : రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు పునర్జన్మ ప్రసాదిస్తోందని మండల ఆరోగ్యమిత్ర గుర్రపు రాజమౌళి అన్నారు. ఒడితల గ్రామానికి చెందిన చింతల సుధాకర్ (42) అనే వ్యక్తికి రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వరంగల్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గుండె బైపాస్ సర్జరీ ఉచితంగా జరిగింది. ఆపరేషన్ కోసం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా, ఉచిత భోజనం, వసతి, బస్సు ఛార్జీలు అందించారని సుధాకర్ తెలిపారు. ఆరోగ్యశ్రీ లేకుంటే తాను బతికి ఉండేవాడిని కానని, ఈ పథకం తనకు పునర్జన్మ ఇచ్చిందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న బిపిఎల్ కుటుంబాలకు నాణ్యమైన వైద్యం, చికిత్సలు ఉచితంగా అందుతాయని రాజమౌళి స్పష్టం చేశారు.



# 14 నెలల పాప అదృశ్యం

## గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు అనుమానం

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ ముందు ఉన్న బస్సు స్టేషన్ లో 14 నెలల పాప సిరిస్టి అదృశ్యమైనట్లు ఇంతేజార్ గంజ్ పోలీసులు ప్రకటించారు. వరంగల్ బస్సు స్టేషన్ లో ఆదివారం ఉదయం బీహార్ కు చెందిన పాప సిరిస్టి తన తండ్రి పక్కన పడుకుని ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు అనుమానం ఉందని పేర్కొన్నారు. పాప గుండ్రని ముఖం, నీలం రంగు కలిగిన ఫ్రాక్ ధరించి ఉందని, ఎవరి ఇంట్లో లేదా ఎవరివద్దైనా పాప ఆచూకీ కనపడితే తమకు సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడునని ఇంతెజార్ గంజ్ ఇన్ స్పెక్టర్ తెలిపారు. పాప ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915